
సాక్షి ఒడిశా

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,64,928లు, బంగారం 2.2 గ్రాములు, వెండి 31.1 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



నైపుణ్యతలో నువా ఒడిశా

- ఒడిశా స్కిల్ కాన్‌క్లేవ్‌-2023ను ప్రారంభించిన సీఎం నవీన్

- 8లో



బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభ

- 8లో

న్యూస్‌రీల్

బొయిపరిగుడ అగ్నిమాపక అధికారికి సత్కారం



శేషదేవ్‌కు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి తుషార్ బెహరా

జయపురం: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధానిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ అగ్నిమాపక అధికారి శేషదేవ్ శబరను సత్కరించారు. భువనేశ్వర్ లోని అగ్నిమాపక విభాగ శిక్షణ కార్యాలయంలో జరిగిన కౌశల ప్రదర్శనలో ప్రతిభ కనపరచిన శషదేవ్‌ను రాష్ట్రమంత్రి తుషార్‌కాంతి బెహరా ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను బహుకరించి, ఘనంగా సన్మానించారు. ప్రతిభ కౌశల ప్రదర్శనలో భువనేశ్వర్, కటక్, సంబల్‌పూర్ అగ్నిమాపక రేంజ్ పరిధిలోని సిబ్బంది పాల్గొనగా.. ఆయన ఉత్తమ ప్రదర్శనతో ప్రశంసలు అందుకున్నారు.

కోల్‌కతా దంపతులకు చిన్నారి దత్తత



కోల్‌కతాకు చెందిన దంపతులకు చిన్నారిని అందిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: వివిధ కారణాలతో సంతానానికి దూరమైన ఓ కుటుంబం.. రాయగడకు చెందిన ఓ చిన్నారిని దత్తత స్వీకరించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కోల్‌కతాకు చెందిన దంపతులకు 7నెలల బాలికను కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ సమక్ష్యంలో దత్తత అందించారు. చిన్నారి శిశు సంరక్షణ కేంద్రంలో గత కొన్నాళ్లుగా ఆశ్రయం పొందుతోంది. దత్తతా లబ్ధిదారు దంపతులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి రమేష్‌చంద్ర నాయక్, ఐడీఎంసీ అధికారి దేవేంద్రకుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



క్షతగాత్రులతో ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్

కొరాపుట్: రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో కాపాడిన నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్.. మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లాలోని అమలాభట్ట గ్రామం బలియాత్ర వెళ్లి, తిరిగి వస్తున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో గుడ్రా గ్రామానికి చెందిన ధనేశ్వర్ జానీకి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే.. వెంటనే తన వాహనంలో బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ధనేశ్వర్ పరిస్థితి విషమంగా ఉండటంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే సహాయానికి బలియాత్ర ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

స్వాభిమాన్ ఏరియాలో పోలీసు శిబిరం



యువకులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న ఏఎస్పీ మనోజ్‌సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా పనాస్‌పుట్ పంచాయతీ దుర్గం ప్రాంతంలో జిల్లా పోలీసులు జనసంపర్క శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు వంట సామగ్రి, యువకులకు క్రికెట్ కిట్లు, దుస్తులు, విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. అలాగే ఆరోగ్య శిబిరం నిర్వహించి, వృద్ధులకు తనిఖీలతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఏఎస్పీ మనోజ్ సింగ్, చిత్రకొండ ఈఎస్‌డీపీఓ అలెక్సియెస్ కిస్పేట్, పనాస్‌పుట్ ఐఐసీ మానస్ రంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు చేదోడు..

- రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగుల పిల్లలకు క్రెచ్ సౌకర్యం
- పని వేళల్లో చిన్నారుల సంరక్షణకు చర్యలు
- త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం
- తొలి విడతలో 10–15 మంది చిన్నారులకు అవకాశం



భువనేశ్వర్ లోని లోక్‌సేవా భవన్

భువనేశ్వర్: రాష్ట్ర సచివాలయంలో త్వరలో పసిపిల్లల సంరక్షణ కేంద్రం క్రెచ్ ప్రారంభించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల బిడ్డలను ఈ కేంద్రంలో సంరక్షిస్తారు. సిబ్బంది సంక్షేమ కార్యకలాపాల్లో భాగంగా దీని ఏర్పాటు కోసం ప్రభుత్వం ముందుకు రావడం విశేషం. ఈ సదుపాయం త్వరలో లోక్‌సేవా భవన్ సముదాయంలో అందుబాటులోకి రానుంది. ప్రతిపాదిత క్రెచ్ సౌకర్యాలను చెల్లింపు ప్రాతిపదికన ఉద్యోగులకు కల్పిస్తారు. తొలుత వచ్చిన వారికి తొలి అవకాశం ప్రాతిపదికన చేపడతారు. ఒడిశా మహిళా, శిశు అభివృద్ధి శాఖ జారీచేసిన ఉత్తర్వుల మేరకు 6నెలల నుంచి ఆరేళ్ల వయస్సు బాలలకు ఈ కేంద్రంలో చేర్చుకుని సంరక్షిస్తారు. తొలి ప్రయోగం కింద సమగ్రంగా 10 నుంచి 15 మంది పిల్లలకు అవకాశం కల్పిస్తారు. 6నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రాధాన్యత ఇస్తారు.

పని వేళలు..

పని దినాలలో నిత్యం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు క్రెచ్ తెరిచి ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాలలో మూసి వేస్తారు. దీనికి గాను తల్లిదండ్రులు ప్రతి నెలా 5న రూ.1,500లు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. తొలుత రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.2,000 చెల్లించడం అనివార్యం.

క్రెచ్‌లో కల్పించనున్న సౌకర్యాలు..

- సమగ్ర వాతావరణంలో సంరక్షణ, ప్రతిస్పందన
- పరిశుభ్రమైన వాతావరణం
- పిల్లల భద్రత, సంరక్షణ కోసం అంకితమైన సుశిక్షితులైన సహాయిక కార్యకర్తలు
- బిడ్డల అభివృద్ధి, వయస్సుకు తగిన కార్యకలాపాలు
- పిల్లలకు అనుకూలమైన బొమ్మలు/పుస్తకాలు/ఆటలు
- చైల్డ్ ఫ్రెండ్లీ టాయిలెట్లు, ప్రథమ చికిత్స, వైద్య సదుపాయాలు
- రిఫ్రిజిరేటర్, మైక్రో ఓవెన్, వాటర్ ఫిల్టర్
- తల్లులకు విరామ ప్రాంగణం, చనుబాల కేంద్రం
- నిత్యం సీసీటీవీ నిఘా

తల్లిదండ్రుల బాధ్యత..

తీసుకు వెళ్లడం, రావడం వంటి సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను కేంద్రంలో దింపాల్సి ఉంటుంది. ఎప్పుడైనా బిడ్డను సందర్శించడానికి అనుమతిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు తిరిగి జాగ్రత్తగా తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అత్యవసర, అసాధారణ సందర్భాలలో మినహా, ఇతర సందర్శకులకు బిడ్డలతో సంప్రదింపులకు అనుమతించరు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి రాతపూర్వక అనుమతితో మాత్రమే ఇతర సందర్శకులు క్రెచ్ లోపలికి ప్రవేశించి, పిల్లలను సంప్రదించేందుకు అనుమతిస్తారు.

చట్టపరమైన ఆదేశాలతో

50మంది కంటే ఎక్కువమంది మహిళా ఉద్యోగులు ఉన్న కార్యాలయాల్లో పసిపిల్లల సంరక్షణ కేంద్రం తెరవాలని ఒడిశా మానవ హక్కుల కమిషన్(ఓహెచ్ఆర్‌సీ) గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మెటర్నిటీ బెనిఫిట్ చట్టం, 1961, 2017 సంవత్సరం సవరణ మేరకు 50 లేదా అంత కంటే ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు పని చేసే సంస్థల్లో క్రెచ్ సౌకర్యాలను కల్పించడం అనివార్యం. దీనికి అనుగుణంగా మార్గదర్శకాలు అమలు కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



క్రెచ్‌లో చిన్నారులకు కల్పించనున్న సౌకర్యాలు

బడులకు సెలవులు

- వడగాడ్పుల ప్రభావంతో ముందే ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం



భువనేశ్వర్: ఈ ఏడాది వడగాడ్పుల ప్రభావం తరగతుల నిర్వహణపై ప్రభావం చూపింది. అంచెలంచెలుగా సెలవులు తాత్కాలికంగా ప్రకటిస్తూ కాలక్షేపం చేసిన వాతావరణం అనుకూలించలేదు. వడదెబ్బ వంటి అవాంఛనీయ ఘటనల నివారణ దృష్ట్యా ప్రభుత్వం వేసవి సెలవులు ముందస్తుగా ప్రకటించాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గతవారం రోజులుగా తీవ్ర వేడిగాలులు వీస్తున్న నేపథ్యంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులను ముందుగానే ప్రకటించాలని రాష్ట్ర పాఠశాల విద్యా కార్యక్రమ అథారిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. వేడిమి దృష్ట్యా ఇటీవల 5 రోజులు(ఏప్రిల్ 12 నుంచి 16 వరకు) అనంతరం (ఏప్రిల్ 19 నుంచి 20 వరకు) 2 రోజులు ఆకస్మిక సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం మే 5నుంచి వేసవి సెలవులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే మండుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ఒకటి నుంచి 12తరగతులకు ఈనెల 21(శుక్రవారం) నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. పాఠశాలల పునఃప్రారంభం తేదీని సంబంధిత అధికారులు తాజా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తర్వాత నిర్ణయిస్తామన్నారు.

బాలికలకు అస్వస్థత..

వడగాడ్పుల తీవ్రతతో ప్రభుత్వ పాఠశాల హాస్టల్‌లో బాలికలు అస్వస్థతకు గురయ్యారు. సుందర్‌గఢ్ జిల్లా కొయిడా ప్రాంతం సోయాంబ ప్రభుత్వ పాఠశాల హాస్టల్‌లోని 32మంది జ్వరం, కడుపు నొప్పి, వాంతుల బారినపడ్డారు. చికిత్స కోసం వీరిని ఆస్పత్రిలో చేర్చారు. బుధవారం రాత్రి 25మంది విద్యార్థులు ఆస్పత్రిలో చేరగా, గురువారం ఉదయం మరో ఏడుగురు చికిత్స కోసం తరలించారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి. చికిత్స కొనసాగుతుందని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ఈ వర్గాలు భావిస్తున్నారు. తీవ్రమైన వేడి పరిస్థితులను తట్టుకోడానికి బాలికలు సరైన ఆహారం, నీరు తీసుకోవడంలో విఫలమైనట్లు వైద్య వర్గాలు తెలిపారు.

తూతూమంత్రంగా సమీక్ష




సమీక్షలో పాల్గొన్న అధికారులు, సర్పంచులు

- కల్యాణ సింగుపూర్ సమితి సమావేశానికి సభ్యులు, అధికారులు గైర్హాజరు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమితి సమీక్ష సమావేశానికి చాలామంది సభ్యులు గైర్హాజరయ్యారు. సమితి అధ్యక్షురాలు అమ్రిత కద్రక అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీడీఓ సునీల్‌కుమార్ ఖొరా, తహసీల్దార్ సుధాకర్ రైతా, ఎంపీ ప్రతినిధి కుమార్ స్వామి కౌసల్య, అటవీశాఖ రేంజర్ చందన్ గమాంగొ, జీపీఈఓ మానస్ రంజన్ ప్రధాన్, ఏబీఈఓ కొండగిరి తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం వేసవి తాపం రోజురోజుకు పెరగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యను నివారించే విషయమై చర్చకు రాగా, దీనిపై సంబంధిత అధికారులు సమావేశంలో హాజరు కాకపోవడంతో చర్చలు అక్కడితోనే ఆగిపోయాయి. అదేవిధంగా సమితిలో ఉచితంగా ప్రభుత్వం తరుపున మంజూరు చేస్తున్న ఉచిత మందులు ప్రజలకు సకాలంలో అందడం లేదని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. వేసవి తాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారని, ప్రతి ప్రాంతంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన బీడీఓ.. త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అయితే సమావేశానికి అంతా హాజరు కావాలని సర్క్యులర్ పంపించినా చాలామంది సభ్యులు హాజరు కాకపోవడంతో సమీక్ష సాదాసీదాగా జరిగింది. త్వరలో మరో సమావేశాన్ని నిర్వహించి, పలు అంశాలు, సమస్యలపై చర్చించి చర్యలు తీసుకుంటామని బీడీఓ ప్రకటించారు.

నామినేషన్లు పూర్తి



అభ్యర్థి	పార్టీ
బిజయ్ జలాన్	హిందుస్థాన్ నిర్మాణ్‌దళ్
తరుణ్ పాండే	కాంగ్రెస్
భువనేశ్వర్ గర్దియా	స్వతంత్ర అభ్యర్థి
టొంకొధొరొ త్రిపాఠి	భారతీయ జనతాపార్టీ
దీపాలి దాస్	బిజూ జనతాదళ్
మనీష్ శర్మ	ఒడిశా జనతా పార్టీ
తులారామ్ గురు	నవభారత్ నిర్మాణ్ సేవాపార్టీ
మహేంద్రా పట్నాయక్	కళింగ సేన
సంతోష్ మహాపాత్రొ	స్వతంత్ర అభ్యర్థి
జ్ఞానేంద్ర బెహరా	స్వతంత్ర అభ్యర్థి
జన్మ రోహిదాస్	ఒడిశా ప్రగతిదళ్
మహేంద్ర లుహా	స్వతంత్ర అభ్యర్థి
శ్రీదాం శర్మ	స్వతంత్ర అభ్యర్థి
రీనా మిశ్రా	దేశ దళ్

భువనేశ్వర్: ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ అకాల మరణంతో అనివార్యమైన ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం భర్తీకి ఉప ఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే. మే 10న ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలు గడువు గురువారంతో ముగిసింది. చివరి క్షణం వరకు ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు మొత్తం 14మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

మేలో రాష్ట్రపతి పర్యటన



ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మేలో రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మహారాజా శ్రీరామచంద్ర భంజదేవ్ యూనివర్సిటీ(ఎంఎస్‌సీబీ) స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు ఆమె మయూర్‌భంజ్ జిల్లా బరిపదలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మే 9న ర్యాలీకి హాజరు కానున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు రాష్ట్రపతి కార్యాలయం నుంచి సమాచారం అందింది.

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జైభారత్ సత్యాగ్రహ దీక్షను డీసీసీ అధ్యక్షుడు, మోహానా ఎమ్మెల్యే దాశరథి గమంగో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీపై ఉద్దేశ పూర్వకంగా కేసులు బనాయిస్తొన్నారని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలికేలా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రశ్నించే వారిని జైలు పంపాలని చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు జాకబ్ భుయ్యాన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బసంత పండా, యువజన నాయకులు సూర్యనారాయణ పాత్రొ, రాజా పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక
- సందడిగా రాయగడ అటానమస్ కళాశాల వార్షికోత్సవం



నాగావళి వార్షిక సంచికను విడుదల చేస్తున్న మంత్రి సరక, అతిథులు

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లా కేంద్రంలోని రాయగడ అటానమస్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన 'లిటరరీ ఒడిస్సీ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రూపొందించిన నాగావళి వార్షిక సంచిక, ఈ.మ్యాగజీన్ లను రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమార్ గంతాయిత్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో సౌకర్యాలు కలిప్స్తోందని తెలిపారు. వారికి ఇష్టమైన రంగంలో రాణించే విధంగా అవకాశాలు కల్పిస్తుండటంతో పాటు తగిన సహాయ, సహకారాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుందన్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో రాణించాలని సూచించారు. ప్రధానంగా ఆదివాసీ ప్రాంతమైన స్థానిక జిల్లాలో ఎంతోమంది విద్యార్థులు ఇదే కళాశాలలో చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించారని గుర్తుచేశారు. తాను కూడా ఇదే కళాశాల విద్యార్థినని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

రాష్ట్రంలో మరో 5 ఎస్‌డీసీలు..

రాష్ట్రంలోని ఆదివాసీ, హరిజన ప్రజల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించడంతో పాటు వారికి అన్ని విధాలా ప్రోత్సాహించే ఉద్దేశంతో రాష్ట్రంలో 9 జిల్లాల్లో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ)లను ఏర్పాటు చేశారని మంత్రి సరక తెలిపారు. త్వరలో మరో 5 ఆదివాసీ జిల్లాలను ఎస్‌డీసీ జిల్లాలుగా గుర్తించి, అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం సన్నహాలు చేస్తోందని, దీనికి తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి పరిచేందుకు ఇది సహకరిస్తుందని తెలియజేశారు. ప్రతి జిల్లాలో ఒక చైర్మన్ కూడా ప్రభుత్వం నియమిస్తుందని, వీరి ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టవచ్చని వివరించారు.

రూ.3.10 కోట్లు మంజూరు..

రాయగడ అటానమస్ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు ఎమ్మెల్యే నిధుల నుంచి సుమారు రూ.3.10 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందులో భాగంగా కళాశాల పరిధిలోని పీఎంజీ హాస్టల్ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.3 కోట్లు మంజూరు చేశానని తెలిపారు. విద్యార్థుల సైకిల్‌స్టాండ్ నిర్మాణానికి అదనంగా మరో రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కళాశాల ప్రాంగణంలో త్వరలో సుమారు వెయ్యి సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మంచేందుకు తనవంతు సహకారం అందిస్తాన హామీ ఇచ్చారు.

వసతిపై వినతి..

రాయగడ కళాశాలలో ప్రస్తుతం వివిధ కోర్సుల్లో సుమారు 5వేల మంది విద్య అభ్యసిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమార్ గంతాయిత్ వార్షిక నివేదికలో పేర్కొన్నారు. ఆదివాసీ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, వారికి అవసరమయ్యే సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అయితే హాస్టల్ గదులు సరిపోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై దృష్టి సారించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. అలాగే రాయగడ మునిసిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయ మాఝి ప్రసంగించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో విద్యార్థిని ప్రసన్న దాస్

క్లుప్తంగా

30 వరకు కేజీబీవీలో ప్రవేశ గడువు పొడిగింపు

పార్వతీపురం టౌన్: కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాల గడువును ప్రభుత్వం ఈనెల 30 వరకు పొడిగించిందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీ రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 30వ తేదీవరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉంటుందని తెలిపారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, మధ్యలో బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్/వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం పంపిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన బుత్తల శ్రీను 18వ తేదీ నుంచి కనిపించడం లేదని భార్య కాంతమ్మ గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసిందని స్థానిక ఎస్సై గంగరాజు తెలిపారు.ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల18వ తేదీన ఇంటినుంచి బయటకి వెళ్లిన తన భర్త శ్రీను నేటికి ఇంటికి చేరలేదని భార్య కాంతమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గొలుసు దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మురళి

విజయనగరం క్రైమ్: మార్నింగ్ వాకింగ్ చేస్తున్న స్వాతి అనే మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని పరారైన సంఘటనకు సంబంధించి ఓ నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి గురువారం ఉదయం పట్టణంలో ఆటోలో వెళ్తున్న ఏలూరు టౌన్‌కు చెందిన గగ్గులోతు యేసును, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శంకరరావు(ఫైల్)

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామానికి చెందిన మద్దిల శంకరరావు(41) శంకరరావు మనస్తాపంతో గురువారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకరరావు ఆటో నడుపుకుంటూ భార్య ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఆటోలో సామాన్లు పోయాయంటూ ఓ వ్యక్తి శంకరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన నాటి నుంచి నుంచి తమ కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని ఆ కారణంగానే తన భర్త మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకున్నాడని భార్య పావని పోలీసులకు తెలిపింది. మృతుడి భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గంట్యాడ: మండలంలోని తాటిపూడి గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తన భార్యను కాపురానికి పంపించడం లేదనే కోపంతో మామ అప్పలస్వామిపై మంగళవారం రాత్రి అల్లుడు పడాల సత్యనారాయణ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన మామ అప్పలస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మామ మృతి చెందడంతో అల్లుడు సత్యనారాయణ పరారయ్యాడు. నిందితుడిని గ్రామ సమీపంలో గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తిరుపతి రావు తెలిపారు.

పాముకాటుతో బాలుడు..


గరుగుబిల్లి: రుత్విక్ (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసకు చెందిన బచ్చల రుత్విక్(7) పాముకాటుతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో బచ్చల లక్ష్మి, చిన్నారావు దంపతులు కుమారుడు రుత్విక్, కుమార్తె రహేలు నివాసం ఉంటున్నారు. అర్ధరాత్రి సమయంలో రుత్విక్‌ను పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నైపుణ్యతలో.. నువా ఒడిశా

- ఒడిశా స్కిల్ కాన్‌క్లేవ్-2023ను ప్రారంభించిన సీఎం నవీన్
- నైపుణ్యాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడి


ఒడిశా స్కిల్ కాన్‌క్లేవ్-2023ను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్


విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను పరిశీలిస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: స్కిల్డ్ ఇన్ ఒడిశా బ్రాండ్ ప్రపంచ వ్యాప్తంగా తళుక్కుమనేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సగర్వంగా ప్రకటించారు. నగరంలో ఒడిశా స్కిల్ కాన్‌క్లేవ్-2023ను ఆయన గురువారం ప్రారంభించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెరుగైన సహకార ప్రణాళికలతో సాంకేతిక నైపుణ్యత రంగంలో కొత్త యుగం ఆవిష్కరణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యత యువతను తీర్చి దిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నువా ఒడిశా(నూతన ఒడిశా) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, డేటా సైన్సెస్, ఇతర ఫ్యూచరిస్టిక్ నాలెడ్జ్ వంటి భవిష్యత్ సాంకేతికతలో యువతకు శిక్షణనిచ్చే కొత్త పథకం నువా ఒడిశాగా పేర్కొన్నారు. వేగవంతమైన సాంకేతిక పురోగతులు జాబ్ మార్కెట్లులో భారీ మార్పుల్ని ఆవిష్కరిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మార్పు ప్రతిఒక్కరూ మానవ వనరుల పెట్టుబడి పట్ల అత్యంత ఉత్సాహం ప్రదర్శిస్తుందన్నారు. 21వ శతాబ్దంలో విజయవంతం కావడానికి అవసరమైన నైపుణ్యాలతో యువతరాన్ని సన్నద్ధం చేయడం తప్పనిసరని సూచించారు. దేశం గణనీయమైన పరివర్తనకు లోనవుతోందని, నైపుణ్యత అభివృద్ధి నైతిక బాధ్యతకు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. ఆర్థిక పురోగతి, సాధికారితకు బలమైన పునాదిగా నిలుస్తుందనే గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఆలోచనల్లో మార్పు రావాలి..



విద్యార్థుల ఆలోచనల్లో మార్పు రావాలి. సూక్ష్మ, లఘు, మధ్య తరహా వర్తక వ్యాపార రంగం అతి త్వరలో పుంజుకుంటుంది. ఇదే పంథాలో సాంకేతిక సమాచార వ్యవస్థ రాజ్యమేలే పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఆయా రంగాల్లో విద్యార్థులు భవిష్యత్‌లో వృద్ధి, అవకాశాలను అంది పుచ్చుకోవడంలో సమయస్ఫూర్తితో ఎదగాలి.

– శ్రీకాంత్ సిన్హా, టాస్క్, తెలంగాణ, సీఈఓ

వ్యూహాత్మక కార్యాచరణతో..



నైపుణ్య పర్యావరణం ఆవిష్కరణలో ఒడిశా కృషి ప్రసంశనీయం. నైపుణ్యం పర్యావరణ వ్యవస్థను సులభతరం చేయడానికి తగిన విధానాలు, అమలు వ్యూహాలను పొందుపరచడంలో ఈ రాష్ట్రం సాఫల్యత సాధిస్తుంది. ఈ కార్యాచరణ అట్టడుగు స్థాయిలో ఉన్న మహిళలతో కలిసి పనిచేసే అవకాశాన్ని కల్పించి నైపుణ్యత శిక్షణకు బలంగా ప్రోత్సహిస్తుంది.

– కాంతా సింఘ్, సంయుక్త రాష్ట్ర మహిళ(భారత కార్యాలయం), ప్రతినిధి

బలమైన ఆర్థిక వ్యవస్థతో..



అభివృద్ధి చెందుతున్న దేశంగా బలమైన ఆర్థిక వ్యవస్థను కూడగట్టుకుని ముందుకు సాగుతున్న దశలో ఉన్నాం. ఈ పురోగతి డిజిటల్ అక్షరాస్యత, ప్రపంచ వాణిజ్యం, పని చేసే వయస్సు జనాభాతో ఆధారపడి ఉంటుంది. నైపుణ్యం అభివృద్ధిలో మంచి వ్యవస్థ ఉపాధి వనరులు ఆలవాలంగా నిలిచి బహుముఖ పురోగతికి దోహదపడుతుంది.

– డాక్టర్ ఉషా టైటస్, ఏఎస్‌ఏపీ కేరళ, చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్

సాంకేతికతతో భాగస్వామ్యం..



ఆధునిక, భవిష్యత్ సాంకేతికతల పరిశ్రమలతో భాగస్వామిగా చేతులు కలిపి వాస్తవ ప్రక్రియలో నైపుణ్యతకు పదును పెట్టడం పట్ల రాష్ట్రప్రభుత్వం ఆసక్తితో ముందుకు సాగుతోందని ఎస్‌డీటీఈ శాఖ మంత్రి ప్రీతిరంజన్ ఘొడై తెలిపారు. ఈ మెగా స్కిల్ కాన్‌క్లేవ్ పరిశ్రమల ప్రముఖులు, విద్యావేత్తలు విద్యార్థుల కలయిక పరస్పర చర్చలు, సహకారానికి ఉమ్మడి వేదికగా నాణ్యమైన తీర్మానాల భావి కార్యాచరణకు దోహదపడుతోందని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా తెలిపారు. పొందికైన నైపుణ్య పర్యావరణ వ్యవస్థ ఆవిష్కరణకు వాటాదారులు కలిసికట్టుగా పని చేయడం చాలా ముఖ్యమని రాష్ట్ర ఎస్‌డీటీఈ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి తెలిపారు.

నైపుణ్యతతో ఉపాధి..



విద్యాభ్యాసం స్థాయిలో ఉపాధి వనరుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. విద్యార్థి దశలో ఈ అవగాహనకు బీజం పడకుంటే.. విస్తరిస్తున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య యువత లభ్యం సాధ్యం కాదు. ఈ దిశలో విద్యాసంస్థలు దృష్టి సారించడం అనివార్యం. విద్యార్థుల ఆసక్తిని అధ్యయనం చేయడం ద్వారా ఉత్తమ లక్ష్యాల ఎంపికల వైపు మళ్లించడంతో సాంకేతిక నైపుణ్యత ఫలప్రదం అవుతుంది.

– జి.ఇన్నోసెంట్ దివ్య, మేనేజింగ్ డైరెక్టర్, తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

యూనివర్సిటీ గుర్తింపునకు కృషి చేస్తా

- కృష్ణచంద్ర గజపతి కళాశాల వార్శికోత్సవంలో ఎంపీ చంద్రశేఖర సాహు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు


వేదికపై ఎంపీ సాహు, జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, అతిథులు

పర్లాకిమిడి: పట్టణంలోని కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలకు ఈ ఏడాది బీఎస్సీ(కంప్యూటర్స్ సైన్స్)కు 32 సీట్లు, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్)కు ప్రభుత్వం 16 సీట్లు కేటాయించడం పట్ల ఎంపీ చంద్రశేఖర సాహు హర్షం వ్యక్తంచేశారు. కళాశాలను యూనివర్సిటీగా గుర్తించేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. పర్లాకిమిడి లోని క్రిష్ణచంద్ర గజపతి కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, ఖల్లికోట్ యూనివర్సిటీ అధ్యాపకులు డా.ప్రఫుల్లకుమార్ మహంతి, హృషీకేష్ పాణిగ్రాహి, విద్యార్థి విభాగం సలహాదారు జితేంద్ర పట్నాయక్, అంతర్జాతీయ నృత్యకారిణి డి.ప్రియాంక, డ్రామాటిక్ సొసైటీ ఉపాధ్యక్షుడు రాధాకాంత భుయ్యాన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రారంభ గీతంతో మొదలనైన ఉత్సవం అనంతరం ఎంపీ మాట్లాడారు. అతి పురాతన ఎస్‌కేసీజీ కళాశాలకు మౌలిక సదుపాయల కల్పనలో ముందుందని, త్వరలో మరిన్ని కొత్త కోర్సుల ఏర్పాటుకు ఆమోదం లభించనుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. నృత్యకారిణి ప్రియాంక ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యం ఆహుతలను అలరించింది.

గజరాజు దాడిలో మూడు ఆవుల మృతి


ఏనుగు దాడిలో మృతి చెందిన ఆవులు

కొమరాడ: మండలంలోని పూజారిగూడ సమీపంలో ఉన్న బందవలస గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు మూడు ఆవులపై ఒంటరి ఏనుగు దాడి చేయడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. అలాగే ఆయన కారును కూడా ఏనుగు ధ్వంసం చేసింది. దీంతో ఆ రైతు త్రీవ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని విషయం తెలుసుకున్న ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మాదలింగి, వన్నాం, పూజారిగూడ తదితర ప్రాంతాల్లో ఏనిమిది ఏనుగుల గుంపు పది రోజులుగా సంచరిస్తోంది.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న హిమాంశు మహాపాత్రొ


ఆగటాళ్లతో రిఫరీ

జయపురం: పట్టణంలోని డీపీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభించారు. హిమాంశు మహాపాత్రొ, త్రినాథ్ దాస్, సంజయ జైన్, ప్రసాద్ పటాన్నయక్ అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం అవిభక్త కొరాపుట్ జిల్లాల ఆటగాళ్ల మధ్య పోటీలు జరిగాయి. పురుషుల డబుల్స్ విభాగంలో జయపురం జట్టు తరఫున సుభాష్‌చంద్ర బెహరా, జాయేష్ కుమార్, అనికేత్ పట్నాయక్, అభిషేక్ గంతాయత్ తలపడ్డారు. ఇందులో సుభాష్-జాయేష్ జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో హరికృష్ణ జెనా-సంతూన్‌పై సిబు-రామ మిశ్రా గెలుపొందారు. మూడో గేమ్‌లో బాలకృష్ణ ద్వారి-చిన్మయ నందాపై అన్సుమాన్ పట్నాయక్, కిషన్ స్వాయి విజయం సాధించారు. నాలుగో మ్యాచ్‌లో మహేష్ దొర-ఇమ్రాన్‌ఖాన్‌పై అఖిలేష్-అగ్రజ విజయం సొంతం చేసుకున్నారు. ఎత్కళదాస్-శ్యామరథ్(కొరాపుట్)తో జరిగిన మ్యాచ్‌లో బాల-గౌరీశంకర పట్నాయక్ గెలుపొందారు. ఆరో గేమ్‌లో పీకే-ఖడంగాపై రాజేష్ పాల్-మోహన పట్నాయక్, ఏడో మ్యాచ్‌లో బాలాజీ దాస్-కేశవ గులారిపై బసంత శనాపతి-బిన్నిత్(కొరాపుట్) అగర్వాల్ విజయం సాధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సాలూరు: పట్టణంలోని దాసరివీధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడుకు తీవ్రగాయాలపాలయ్యాడు. తీవ్రగాయాలతో యువకుడు ఉండడాన్ని గుర్తించిన స్థానిక యువత పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అక్కడినుంచి విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీనిపై సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్షతగాత్రుడు మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడని హిట్ అండ్ రన్‌కేసు నమోదుచేశామని తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వ్యాన్‌ను ఢీకొని వ్యక్తికి...

శృంగవరపుకోట: మండలంలోని విశాఖ అరుకు రోడ్డులో కాపుసోంపురం వద్ద కుమార్తెతో బైక్‌పై వస్తున్న వ్యక్తి అదుపుతప్పి వాన్ను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాడు. కాపుసోంపురం గ్రామానికి చెందిన దాసరి అప్పారావు తన ఐదేళ్ల కుమార్తె మధులితతో కలిసి బైక్‌పై ఎస్.కోట వస్తుండగా అదుపు తప్పి వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో అప్పారావు కుమార్తె స్వల్పగాయాలతో బయటపడగా, అప్పారావు కుడికాలు పూర్తిగా ఛిద్రమైంది. దీంతో స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి ప్రాథమిక చికిత్స చేసి, విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.


శృంగవరపుకోట: గాయాల పాలైన అప్పారావు

పాడి దిగుబడిపై వడ దెబ్బ

- కొద్దిపాటి జాగ్రత్తలతో పాడిపశువుల సంరక్షణ


వేపాడ: ఎండలో మేస్తున్న పశువులు


వేపాడ: చెట్ల నీడలో పశువులకు రక్షణ కలిస్తున్న రైతు


రామభద్రపురం: తారాపురంలో పాడి ఆవుకు పాలు పితుకుతున్న మహిళా రైతు


రామభద్రపురం: పశువైద్యశాలలో పాడిపశువును పరీక్షిస్తున్న పశువైద్యాధికారిణి హిరణ్య

రామభద్రపురం/వేపాడ: గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 60 నుంచి 70 శాతం మంది రైతులు వ్యవసాయ పంటల సాగుతో పాటు పాడిపశువుల పెంపకంపై దృష్టి సారిస్తారు. అయితే వాటి సంరక్షణలో మెలకువలు తెలియక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోక నష్టాపాలవుతారు. వేసవిలో పాడిపశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడమే కాక పాడి పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, అంతే కాక పశువు చూడికట్టే అవకాశం ఉండదని పశువైద్యాధికారులు చెబుతున్నారు. వేసవిలో పాడి ఆవులు, గేదెల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బకు గురై ఒక్కోసారి పశువు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

వేసవిలో పశువులు తాగే నీరు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉండాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతుంది. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలో చేరి పారుడు వ్యాధులు కలుగుతాయి. కాబట్టి పశువులు తాగేందుకు స్వచ్ఛమైన నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. రోజులో కనీసం మూడు సార్లు నీటిని అందించడం అవసరం. ఆరుబయట తొట్టిల్లో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువ నీరు తాగుతాయి. వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు తదితరాలను బట్టి రోజుకు సుమారు 28 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు దిగుబడికి నాలుగు లీటర్లు చొప్పున నీటిని తాగుతాయి.


ఎల్.విష్ణు పశు సంవర్ధక శాఖ ఎ.డి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పశువులకు వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని అప్పడప్పుడూ తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి కమ్మలతో గానీ, ఎండు గడ్డితో గానీ కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలోనే మాత్రమే మేత కోసం విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకరజాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బకు గురైతే లక్షణాలు ఇలా..

వడదెబ్బకు గురైన పశువు లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది.పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనపడుతుంది. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని స్పృహకోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాడి పశువు అయితే పాల ఉత్పత్తి పడిపోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వేసవిలో పాడిపశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై ఒత్తాలి. కొద్ది ఊరట కలిగిన తరువాత దగ్గరలో ఉన్న పశువైద్యుడిని సంప్రదించి సెలైన్‌లు పెట్టాలి.ఒక్కసారి వడదెబ్బ తగిలిన పశువుకు బతికినంతకాలం పాల దిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

ఎల్ విష్ణు, పశుసంవర్ధక శాఖ ఎ.డి. బొబ్బిలి
బి.చలపతిరావు, ఎ.డి ఎస్.కోట

చెరువులో పడి బీటెక్ విద్యార్థి మృతి


ఆస్పత్రి వద్ద సాయిభరత్ కుమార్ మృతదేహం

పార్వతీపురం: స్నేహితులతో సరదాగా చెరువుకు స్నానానికి వెళ్లిన ఒడిశాకు చెందిన బీటెక్ విద్యార్థి చెరువులో పడి గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్ఐ వై.సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎంఆర్ నగరంలో జరుగుతున్న అమ్మవారి పండగకు స్నేహితుడు యలమంటి సంపత్‌కుమార్ ఆహ్వానం మేరకు ఒడిశాలోని రాయగడ జిల్లా గడశేశికల, కొలనార్ సమితికి చెందిన మరిశర్ల సాయిభరత్ కుమార్(18) వచ్చాడు. స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని చెరువుకు స్నానానికి వెళ్లాడు. ఇంతలో ప్రమాదాశాతు గోతిలోపడి మునిగిపోవడాన్ని మిగతా గమనించి.. వెంటనే బయటకు తీయడంతో పాటు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాయిభరత్ విశాఖపట్నంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో సరదగా గడుపుదామని వచ్చి, మృత్యువాత పడటంతో బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై జియ్యమ్మవలస మండలం రామినాయుడువలసకు చెందిన రెడ్డి స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

క్లుప్తంగా

23న జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలను ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల క్రీడామైదానం వేదికగా ఆరోజు ఉదయం 8 గంటలకు ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు సెప్టెంబర్ ఒకటి, 2004 తర్వాత జన్మించి ఉండాలని, శ్రీకాకుళం జిల్లా వాసులై ఉండాలని స్పష్టంచేశారు. ఇక్కడ ఎంపికల్లో రాణించి క్రీడాకారులను త్వరలో విశాఖపట్నం వేదికగా జరిగే ఏసీఏ అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు పంపిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, నేటివిటీ ధృవపత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలతో హాజరుకావాలన్నారు. అలాగే క్రీడాకారులు తెలుపురంగు యూనిఫాం, షూ విధిగా ధరించి హాజరుకావాలని ముస్తాక్ సూచించారు. మరిన్ని వివరాలకు కోచ్ సుదర్శన్ (9441115396), కె.ఎస్.ఎం. శైలానీ (9246631797) నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

జాబ్ మేళాలో 65 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగులతో ప్రిన్సిపాల్ జవహర్

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 65 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. జాబ్‌మేళాకు 120 మంది హాజరుకాగా అందులో 65 మంది ఎంపికయ్యారని, వారికి ఆఫర్ లెటర్లు కూడా అందించారని తెలిపారు. కార్యక్రమంలో శిరిడి సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ జగన్నాథంనాయుడు, కంపెనీ ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్‌లు శివకుమార్, రాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.దిలీప్‌కుమార్, డి.రామ్మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి చేయూత

జి.సిగడాం: జాతీయ స్థాయిలో బంగారు, రెండు వెండి పతకాలను సాధించిన జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవి అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు తాము సహకరిస్తామని పైడి భీమవరంలో ఉన్న అరబిందో హెచ్‌ఆర్ మేనేజర్ కమలాకర్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ కేవీఎస్ఎన్ రాజు, జోగారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాదరావు(సివిల్ ప్రసాద్) ఆధ్వర్యంలో గురువారం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. దీంతో కంపెనీ ప్రతినిధులు సాయికుమార్, ప్రసాదరావులు రూపాదేవిని సత్కరించారు. అంతర్జాతీయ స్థాయికి వెళ్లి ఆడేందుకు సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో చందనాల రామకృష్ణ రంగారావు, బత్తుల రాము, సతీష్ తదితరులు ఉన్నారు.

రూపాదేవికి అరుదైన గౌరవం

పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవికి రెడ్డీస్ ఫార్మా కంపెనీలో అరుదైన గౌరవం దక్కింది. కంపెనీ ప్రతినిధులను ఆమె గురువారం కలిశారు. అయితే రూపాదేవిని చూసిన వెంటనే అక్కడ అధికారులు, శిక్షణలో ఉన్న యువత ఆశ్చర్యపోయారు. కాళ్లు పని చేయకుండా ఆటలు ఎలా ఆడుతున్నావంటూ చుట్టుముట్టి సెల్ఫీలు దిగారు. ఆమెకు కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామని హెచ్‌ఆర్ మేనేజర్ చెప్పారు.

24న జైభారత్ సత్యాగ్రహ సభ

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న విజయవాడలో జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, పార్టీ జిల్లా కోఆర్డినేటర్ డోల శ్రీను పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నేతలు సనపల అన్నాజీరావు, పేడాడ పరమేశ్వరరావు, దేశ్శెళ్ల గోవింద మల్లిబాబు, చింతాడ దిలీప్, పైడి నాగభూషణరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, తెంబూరు మధుసూదనరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స వెంకటరమణ, దంత త్రినాధరావు, లఖినేన సాయిరాం, అంబటి దాలినాయుడు, రెహమాన్, మామిడి జగన్నాథం పాల్గొన్నారు.

రిమ్స్ జనరల్ మెడిసిన్ హెచ్ఓడీగా సునీల్‌నాయక్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల జనరల్ మెడిసిన్ విభాగాధిపతిగా డాక్టర్ కె.సునీల్‌నాయక్ నియమితులయ్యా రు. కొద్ది నెలల క్రితం ఈయన ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది విశాఖపట్నం కేజీహెచ్‌కు బదిలీపై వెళ్లారు. తిరిగి ఆయన్ను శ్రీకాకుళం రిమ్స్ కళాశాలలో నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం హెచ్ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు విశాఖపట్నం కేజీహెచ్‌కు బదిలీపై వెళ్లారు. సునీల్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

● ఇచ్ఛాపురంలో 'మాహిష్మతి'





స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో భాగంగా ఇచ్ఛాపురంలో వినూత్న అలంకరణలు కనిపిస్తున్నాయి. బస్టాండ్‌కూడలిలో బాహుబలి చిత్రంలోని మాహిష్మతి సామ్రాజ్యం సెట్‌ను వేశారు. కోల్‌కతాకు చెందిన 50 మంది కార్మికులు 20 రోజుల పాటు శ్రమించి 70 అడుగుల ఎత్తులో ఈ కట్టడాన్ని నిర్మించారు. అలాగే మేదవీధిలో నిర్మించిన వెదురు బద్దీల పడవ కూడా ఆకట్టుకుంటోంది.

–ఇచ్ఛాపురం:

అమ్మకు ఉత్సవం

- 22వ తేదీ నుంచి నీలమణి దుర్గ ఆలయంలో ఉత్సవాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు


నీలమణిదుర్గ అమ్మవారు


పాతపట్నం ప్రసిద్ధిగాంచిన శ్రీనీలమణిదుర్గ ఆలయం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గమ్మ వార్షిక నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఉత్సవాలకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. గత రెండేళ్లుగా కరోనా కారణంగా అమ్మవారి వార్షిక మహోత్సవాలు నిర్వహించలేదు. దీంతో ఈ ఏడాది అమ్మవారి మహోత్సవాలు భారీగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావులు చర్యలు తీసుకుంటున్నారు.

మహోత్సవాలు ఇలా..

ఈ నెల 22న వర్ధినీ కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, దేవ పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, అఖండ దీపస్థాపనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న కుంకుమార్చన, ఆవరణ దేవతా హోమాలు, మహారాజ భోగములు, 25న అష్టోత్తర శతనామార్చనలు, మూలమంత్ర, మంటప దేవతా హోమాలు, 26న శ్రీలలిత త్రిశతి నామార్చనలు, శ్రీ సూక్త, దుర్గా సూక్త హోమాలు, 27న శ్రీలక్ష్మీనారాయణ హోమాలు, 29న రుద్ర హోమాలు, 30న వర్ధనీ కలశోద్వాసనములు, అవభృథ స్నానము, ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



అమ్మవారి మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆలయానికి రెండు రాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– నూలు ఈశ్వరరావు, చైర్మన్, నీలమణిదుర్గ ఆలయం, పాతపట్నం

ఒకరి వెంట ఒకరు

- మూడు రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతి
- భార్య మరణం తట్టుకోలేక ఆర్మీ జవాన్ ఆత్మహత్య
- ఈసర్లపేట గ్రామంలో విషాద ఛాయలు


భర్త మంగరాజు, భార్య మౌనిక(ఫైల్)

పొందూరు, ఆమదాలవలస రూరల్: ఈసర్లపేట విషాదమయంగా మారింది. మూడు రోజుల వ్యవధిలో రెండు మరణాలను చూడడంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. అనారోగ్యంతో వివాహిత మృతి చెందగా.. ఆమె ఎడబాటును తట్టుకోలేక భర్త మూడో రోజే ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ ఈసర్లపేట గ్రామానికి చెందిన మంగరాజు రాజుబాబు (27) అనే ఆర్మీ జవాన్, అతని భార్య మంగరాజు మౌనిక (24) ఇద్దరూ మూడు రోజుల వ్యవధిలో మృతి చెందారు. వీరికి 2022లో విశాఖలో వివాహం జరిగింది. రాజుబాబు హరియాణాలో విధులు నిర్వహిస్తున్నాడు. మౌనిక ఏడు నెలల గర్భిణి. అనారోగ్య సమస్యల వల్ల విశాఖలోని ఆర్మీ ఆస్పత్రిలో చేరింది. ఆమెను చూసేందుకు రాజుబాబు వచ్చాడు. అయితే మౌనిక పరిస్థితి విషమించడంతో ఆమెను కేజీహెచ్‌కు షిఫ్ట్ చేశారు. కానీ 16వ తేదీన ఆమె కన్ను మూసింది. అప్పటి నుంచి రాజుబాబు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. భోజనం కూడా చేయకుండా పరధ్యానంగా ఉండేవాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్తానని చెప్పి ఈ నెల 19 మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రైలులో ప్రయాణించి పొందూరులో దిగాడు. ఆ రోజు సాయంత్రం తాను చనిపోతున్నానని తన స్నేహితుని సెల్‌కు మెసేజ్ పెట్టాడు. వెంటనే స్నేహితులు 100కు ఫోన్ చేశారు. పొందూరు పోలీసులకు కూడా సమాచారం అందడంతో అంతా కలిసి రాజుబాబు కోసం గాలించారు. రైలు పట్టాలపై కూడా వెతికారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో పొందూరు మండలంలోని కొంచాడ గ్రామానికి సమీపంలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయినట్లు గుర్తించారు. రాజుబాబు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం చేయించి బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్మీ జవాన్ తల్లిదండ్రులు సత్యనారాయణ, సత్యవతి దంపతులు ఆమదాలవలస పట్టణ సమీపంలో పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకుని బతుకుతున్నారు. తల్లిదండ్రుల కష్టంతో రాజుబాబు ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగంలో స్థిరపడిన కుమారుడికి వివాహం చేసి ఏడాది గడవక ముందే కుమారుడు, కోడలు ఇలా దూరమైపోవడంతో వారు తల్లడిల్లిపోయారు. ఆర్మీజవాన్ అంత్యక్రియలు స్వగ్రామం ఈసర్లపేటలో గురువారం నిర్వహించారు. రాజుబాబు దంపతుల మృతిపై మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి సంతాపం తెలియజేశారు.

50 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు

- డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: మే ఒకటి నుంచి జిల్లాలో మొదలుకానున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విజయవంతంగా నిర్వహించేలా సన్నద్ధం కావాలని డీఎస్‌ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు కోరారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(విజయవాడ) ఆదేశాలు మేరకు శ్రీకాకుళం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2023- 24 సంవత్సరానికిగాను జిల్లా నలుమూలలు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణ నిమిత్తం చర్చించేందుకు గురువారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, పీఈటీ సంఘం, క్రీడాసంఘాల ప్రతినిధులతో కోడి రామ్మూర్తి స్టేడియంలో సమావేశం నిర్వహించారు. శిక్షణ శిబిరాల నిర్వహణ, క్రీడాకారుల హాజరు, వసతులు, సౌకర్యాల కల్పన, క్రీడాపరికరాల అందజేత తదితర అంశాలపై చర్చించారు. 50 కేంద్రాల్లో జరిగే శిక్షణా శిబిరాలకు సంబంధించిన జాబితాను సిద్ధంచేసే బాధ్యతను ఒలింపిక్ అసోసియేషన్‌కు కట్టబెట్టారు. సమావేశంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు, పీడీ-పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, సంపతిరావు సూరిబాబు, యాళ్ల పోలినాయుడు, ఎమ్మెస్సీ శేఖర్, సాధు శ్రీనివాసరావు, జి.అర్జున్‌రావురెడ్డి, రెడ్డి శివకుమార్, వంశీ, జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మే 1 నుంచి సీఎం కప్ రాష్ట్రపోటీలు..

తిరుపతి వేదికగా మే 1 నుంచి 5 వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు శాప్ షెడ్యూల్ విడుదల చేసింది. 15 క్రీడాంశాలల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలను ఇప్పటికే పూర్తిచేశారు. ఎంపికైన క్రీడాకారుల తుది జాబితాలు ఖరారుచేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీరికి శిక్షణా శిబిరాలను నిర్వహించి రాష్ట్రపోటీలకు సిద్ధం చేసేలా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చీకటైతే చాలు చోరీ

- ముంగెన్నపాడు కాలనీలో భారీ దొంగతనం
- 20 తులాల బంగారం, రూ.30వేలు నగదు ఎత్తుకెళ్లిన దొంగలు
- వరుస దొంగతనాలతో మండల ప్రజల్లో ఆందోళన


ముంగెన్నపాడు కాలనీలో క్లూస్ టీమ్ పరిశీలన

ఎల్ఎన్ పేట: మండల వాసులను దొంగల భయం వెంటాడుతోంది. రెండు రోజులు వరుసగా దొంగతనాలు జరగటంతో చీకటి పడితే భయపడుతున్నారు. మండలంలోని ముంగెన్నపాడు కాలనీలో దొంగలు బుధవారం రాత్రి భారీ చోరీకి పాల్పడ్డారు. కాలనీలో సేపాన రామ్మూర్తి, మాణిక్యం అనే వృద్ధ దంపతులు నివాసం ఉంటున్న ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు ఇంట్లో దాచుకున్న 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.30వేలు నగదు దోచుకుని పోయారు. వేసవి కావడంతో దంపతులు ఇంటి తలుపులకు గడియ పెట్టి వరండాలో నిద్రపోయారు. దీంతో రాత్రిపూట ఇంటి తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉంచిన బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిపోయారు. దంపతులు ఉదయం నిద్ర లేచి చూసే సరికి తలుపులు తీసి ఉండడం కనిపించింది. లోపలకు వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాను పరిశీలించగా 20 తులాల బంగారం, రూ.30వేల నగదు పోయినట్లు గుర్తించారు. ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరుబుజ్జిలి ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు.

ముందు రోజు కృష్ణాపురంలో

కృష్ణాపురం గ్రామంలో మంగళవారం రాత్రి ఇంటి గేటు తాళం విరిచి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు.. గదిలో నిద్రపోతున్న చల్ల రవళి మెడలోనుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడుని తెంచుకుని పారిపోయారు. దొంగలు అని అరుచుకుంటూ వెంబడించినప్పటికీ దొంగలు చీకట్లో పారిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

అడ్డంగా దొరికిపోయాడు


పట్టుబడిన కోట అమరనాథ్

కాశీబుగ్గ: చోరీకి వెళ్లిన దొంగ ఇంటి యజమానులకు అడ్డంగా దొరికిపోయిన ఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలాస రైల్వేస్టేషన్ వెనుక భాగంలో 8వ వార్డు నర్సిపురం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటాక ఓ దొంగ ఒక ఇంటిలోకి ప్రవేశించాడు. అయితే ఇంటిలోని మహిళ దొంగను గమనించడంతో అతడు లోపలకు వెళ్లాక బయట తలుపులకు తాళం వేసేశారు. అనంతరం 100కు కాల్ చేయడంతో పోలీసులు వచ్చి దొంగను అరెస్టు చేశారు. అతని వేలి ముద్రలు పరిశీలించగా విజయనగరం పట్టణానికి చెందిన కోట అమరనాథ్‌గా గుర్తించారు. ఇతనిపై పది దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాశీబుగ్గ ఎస్ఐ గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్‌కు పాన్ తప్పనిసరి

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ


హాజరైన ఆరు జిల్లాల రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు

సాక్షి, విశాఖపట్నం : ఆదాయపు పన్ను ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్ (ఎస్ఎఫ్‌టీ) దాఖలు చేసేటప్పుడు రూ.10 లక్షలు పైబడిన ప్రతి లావాదేవీలకు కచ్చితంగా పాన్ నంబర్ అవసరమని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.బాలకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఎస్ఎఫ్‌టీ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జిల్లా రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐజీ బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ సూచనల మేరకు ఎస్ఎఫ్‌టీ పొందుపరిచే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఐటీ శాఖ ఇంటిలిజెన్స్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అధికారి ఎంవీఎస్ఎస్ భవన్నారాయణ మాట్లాడుతూ స్థిరాస్తుల విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రూ.30 లక్షలు విలువ మించిన లావాదేవీల సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. వీటికి సంబంధించిన స్టేట్‌మెంట్స్ ఫైల్ చేసేందుకు మే 31వ తేదీ తుది గడువు అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికే ప్రాధాన్యం


నారాయణవలస వద్ద కోతకు సిద్ధంగా ఉన్న ఆర్ఎన్ఆర్ రకం వరి

- షుగర్ లెస్(ఆర్ఎన్ఆర్) వరి పంటపై రైతుల ఆసక్తి
- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం
- రబీలో 11 వేల ఎకరాల్లో సాగు



నరసన్నపేట: ఆరోగ్యమే ప్రధానంగా జిల్లాలో సాగు పద్ధతి మారుతోంది. షుగర్ వ్యాధి బాధితులు రానురానూ పెరిగిపోతుండడం, వరి అన్నం తినడమే దీనికి కారణమనే అంశం ప్రబలంగా ప్రచారమవుతుండడంతో ఆరోగ్యకర పంటల సాగువైపు జిల్లా రైతులు కూడా దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగానే షుగర్ లెస్(ఆర్ఎన్ఆర్) రకం వరిని రబీలో సాగు చేశారు. ఈ రబీలో 20వేల పైచిలుకు ఎకరాల్లో వరి వేశారు. ఈ విస్తీర్ణంలో చాలా వరకు షుగర్ లెస్ రకాన్ని పండించారు. ఇది ఎకరాకు 35 బస్తాల పైనే దిగుబడి వస్తుంది. బస్తా(80) కేజీలు రూ.1800 నుంచి రూ.2 వేలు వరకూ ధర పలుకుతుంది. మిల్లర్లు కూడా కళ్లాల వద్దకు వచ్చి ధాన్యం తీసుకువెళ్తున్నారు. జిల్లాలో ఆర్ఎన్ఆర్, 1010, 1153, 1156 రకాల వరిని రబీలో రైతులు వేశారు.

విదేశాలకు ఎగుమతి

షుగర్ లెస్ ధాన్యానికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడిప్పుడే లోకల్ వినియోగదారులు కూడా అలవాటు పడుతున్నారు. ఈ రకం బియ్యం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదని వైద్యులు కూడా చెబుతుండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోంది. గ్లూకోజ్ శాతం తక్కువగా ఉండటం, ప్రొటీన్స్ లభిస్తుండటంతో వ్యాధి బాధితులు ఈ అన్నాన్ని ఎంచక్కా తమ మెనూలో చేర్చుకుంటున్నారు. జిల్లాలో పండిన పంటను దళారుల ద్వారా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల మిల్లర్లు తీసుకువెళ్తున్నారు.

పెరుగుతున్న విస్తీర్ణం

వ్యవసాయాధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, కోటబొమ్మాళి, టెక్కలి, సారవకోట మండలాల్లో షుగర్ లెస్ వరిని రైతులు అధికంగా పండిస్తున్నారు. ఈ సీజన్‌లో 11 వేల ఎకరాల్లో రైతులు వేశారు. అదే గత రబీలో 7 వేల ఎకరాల్లో వేశారు. 2021 రబీ నుంచే షుగర్ లెస్ వరిని రైతులు వేస్తున్నారు. వచ్చే రబీకి మరింతగా విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రెండేళ్లుగా సాగు చేస్తున్నా..



గత ఏడాది ఎకరా విస్తీర్ణంలో షుగర్ లెస్ రైస్ సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. బస్తా ధాన్యం రూ.1800 లకు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో వేశాను. పంట బాగానే ఉంది. దిగుబడి బాగుంటుందని అనుకుంటున్నా. మరో 10 రోజుల్లో పంట కోతకు వస్తుంది.

– ధర్మాన వెంకటరమణ, కంబకాయ

ధర బాగుంది



షుగర్ లెస్‌కు మంచి ధర పలుకుతుంది. కష్టం లేకుండానే మిల్లర్లు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో షుగర్‌లెస్(ఆర్ఎన్ఆర్) వరిని పండిస్తున్నాం. ఈ సీజన్‌లో ఐదు ఎకరాల్లో వేశాను. బస్తా రూ. 2 వేలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. రైతులకు మంచి లాభసాటిగా ఉంది.

– జాయి శేషు రైతు, బుచ్చిపేట

ఆసక్తి పెరుగుతోంది



రబీలో ఏటా వరి విస్తీర్ణం పెరుగుతోంది. నరసన్నపేట డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో రైతులు వరిని వేశారు. దీంట్లో ఆర్ఎన్ఆర్ (షుగర్‌లెస్) వరిపైనే రైతులు బాగా ఆసక్తి చూపిస్తున్నారు. వచ్చే సీజన్‌లో మరింతగా విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– రవీంద్ర భారతి, నరసన్నపేట ఏడీ

స్వరాజ్‌కు యువరత్న పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అంబటి స్వరాజ్

నందిగాం: మండలంలోని దేవుపురం గ్రామానికి చెందిన అంబటి స్వరాజ్ చిన్న వయసులోనే సాహిత్య రంగంలో చూపిన ప్రతిభను గుర్తించి ఈ నెల 16న విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో యువరత్న పురస్కారంతో సత్కరించారు. జయహో భారతీయం సాంస్కృతిక సంస్థ, తెలంగాణ అసోషియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు. చిన్న వయసులోనే దృష్టి లోపంతో ఇబ్బంది పడిన స్వరాజ్.. చినజీయర్‌స్వామి అంధుల పాఠశాలలో చేరి అంచెలంచెలుగా ఎదిగి 9వ తరగతిలోనే శతపద్యధారణాధురీణ బిరుదు, 10వ తరగతిలో ద్వాదశ విభిన్న ఛందో పద్య రచయితగా, ఇంటర్ మొదటి ఏడాదిలో 'నేను చెప్పు మాట నిజము చిత్రమా' అనే మకుటంతో శతకం పూర్తి చేశారు. సాహిత్యంలోనే కాకుండా పారా ఒలింపిక్స్‌లో అంధుల విభాగంలో రన్నింగ్, లాంగ్‌జంప్‌ల్లో జిల్లా స్థాయిలో 4 స్వర్ణాలు, రాష్ట్ర స్థాయిలో 5 స్వర్ణాలు, ఒక రజతం, జాతీయ స్థాయిలో రెండు రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నాడు. పదో తరగతిలో 85 శాతం మార్కులు సాధించి నేత్ర విద్యాలయంలో రెండో స్థానంలో నిల్చారు. స్వరాజ్ యువరత్న పురస్కారం సాధించడం పట్ల దేవుపురం సర్పంచ్, ఎంపీటీసీ యర్ర విశ్వశాంతి, యర్ర చక్రవర్తి గురువారం అభినందనలు తెలిపారు. కుమారుడి దృష్టి లోపంతో కుంగిపోకుండా వెన్నంటే ఉండి సహకరిస్తున్న తల్లిదండ్రులు జ్యోతి, శ్యామలరావులను అభినందించారు.

పాముకాటుతో ఆర్మీ విశ్రాంత ఉద్యోగి మృతి


గుడ్ల రామజోగి (ఫైల్)

నరసన్నపేట: ఎక్కడ పాము కలకలం రేపినా వెంటనే వెళ్లి దానిని పట్టుకొని సుదూర ప్రాంతాల్లో విడిచిపెట్టే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గుడ్ల రామజోగి (60) పాము కాటుకు గురై మరణించారు. నరసన్నపేటలోని గాంధీనగర్ ఒకటో వీధిలో ఉంటున్న ఈయన బుధవారం రాత్రి తామరాపల్లి లో తన స్నేహితుడు ఇంటి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోయింది. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రామజోగి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

25 నుంచి శంకరాచార్యుల జయంత్యుత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: సనాతన ధర్మాన్ని కాపాడేందుకు కృషి చేసిన జగద్గురువు ఆదిశంకరాచార్యులని దేవీపీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ అన్నారు. గుజరాతీపేట లోని శ్రీరాజరాజేశ్వరీ లలితా మహాత్రిపురసుందరి దేవీ పీఠంలో ఈ నెల 25 నుంచి 10 రోజు ల పాటు జరగనున్న శంకరాచార్యుల జయంతి ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. స్తోత్రపారాయణలు, చండీ హోమం, కవి సమ్మేళనం కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, భక్తులంతా పాల్గొనాలని కోరారు. వ్యాపారవేత్త అంధవరపు సంతోష్ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు జరిగినపుడే మనమంతా సుఖసంతోషాలతో ఉంటా మన్నారు. కార్యక్రమంలో పీఠం సహ నిర్వాహకులు పెంట వశిష్ఠ శర్మ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.